క్లుప్తంగా

కుంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్



కుంభోత్సవ పల్లకీసేవలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే నరేంద్ర

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా దేవి వార్షిక కుంభోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారి వార్షిక కుంభోత్సవాన్ని పురస్కరించుకుని కుంభహారతికి ముందు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహించగా.. కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే నరేంద్ర పాల్గొన్నారు. అనంతరం కుంభహారతిలో పాల్గొని, భ్రమరాంబాదేవి నిజరూప దర్శనం చేసుకున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



గౌడ్ సెంటర్లో విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు విన్యాసాలను ప్రదర్శించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడునాయక్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రమాదాలు జరిగిన సమయంలో జాగ్రత్తలు పాటించాలి తదితర విషయాలను వివరించారు. అనంతరం ప్రధాన కూడళ్ల వద్ద అగ్నిమాపక విన్యాసాలను నిర్వహించారు. సిబ్బంది కరీముల్లా, జిలానీ, గౌస్, మోహన్‌రాజు, సుబ్బయ్య, చాంద్‌బాషా పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దివాకర్‌రెడ్డి (35) వ్యక్తి మృతి మృతి చెందాడు. సోమవా రం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపిన వివరాల మేరకు...ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె గ్రామానికి చెందిన దివాకర్‌రెడ్డి పనుల నిమిత్త ద్విచక్ర వాహనంలో నంద్యాలకు బయలు దేరాడు. ఇంతలో గోవిందపల్లెలో గణేష్ వేబ్రిడ్జి సమీపంలో నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన దివాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి శివనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలి



మాట్లాడుతున్న ఎ.రణధీర్

ఆత్మకూరు: పట్టణాల్లో పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశాన్ని పట్టణ నాయకుడు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఎ.రణధీర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరాలకు సంబంధించి పట్టణాల్లో ఆస్తి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020-21 సంవత్సరాలతో పోలిస్తే 30 శాతం పన్ను పెంచుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీంతో రూ.320 కోట్లు భారం పట్టణ ప్రజలపై పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. పెంచిన పన్నుకు వ్యతిరేకంగా పట్టణ ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, షేక్‌ఇస్మాయిల్, వీరన్న, పి.భాస్కర్ పాల్గొన్నారు.

21న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో ఈస్టర్ పండుగ సందర్భంగా ఈనెల 21వ తేదీన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ పోటీల విజేతలకు వరుసగా.. రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజును ఈనెల 21వ తేదీ 8 గంటల్లోపు చెల్లించాలని సూచించారు.

కళతప్పిన రైతన్నల జాతర

- కలప విక్రయాలు నిషేధించిన అటవీశాఖ
- చెక్క పరికరాల స్థానంలో ఇనుప వస్తువుల విక్రయం
- జాతరకు వచ్చేందుకు ఆసక్తి చూపని రైతులు



చెక్క చక్రాల స్థానంలో టైర్లు, ఇనుప పరికరాలు



ఇనుప వ్యవసాయ పరికరాలే శరణ్యం..

జూపాడుబంగ్లా: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రైతన్నల జతరగా పేరొందిన తర్తూరు జాతరలో కలప విక్రయాల్లేక కళతప్పుతోంది. గతంలో అటవీశాఖ, లైసెన్స్ కలిగిన వ్యాపారుల ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం చెక్క సామాన్ల స్థానంలో ఇనుముతో చేసిన పనిముట్లు రావడంతో జాతరకు రైతులకు రాక తగ్గింది.

15 ఏళ్ల క్రితం వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో విక్రయం..

15ఏళ్ల క్రితం వరకు తర్తూరు జాతరలో అటవీశాఖ ఆధ్వర్యంలో కలప విక్రయాలు చేసేవారు. అలాగే లైసెన్స్ కలిగిన కలపడిపోల ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన చెక్క వ్యవసాయ పనిముట్లు విక్రయించటంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తర్తూరు జాతరకొచ్చి అవసరమైన వ్యవసాయ పనిముట్లు కొనుగోలుచేసి తీసుకెళ్లేవారు. అటవీశాఖ అధికారులు ప్రస్తుతం తర్తూరు జాతరలో కలప విక్రయాలను పూర్తిగా నిషేధించటంతో రైతులు జాతరకు రాకుండా అడ్డుకున్నట్లయ్యింది. దీంతో క్రమేణా జాతరకు రైతులరాక తగ్గిపోయింది. దీనికితోడు కలప విక్రయాలు నిలిచిపోవడంతో చెక్క వ్యవసాయ పరికరాల స్థానంలో ఇనుప వ్యవసాయ పనిముట్లు వచ్చాయి.

చెక్కబండ్ల స్థానంలో ఇనుప బండ్లు..

సన్న, చిన్న కారు రైతులు అధిక ధరలు వెచ్చించి వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసి సేద్యం చేయలేక ఉన్న కాడెద్దులను జాతరలో విక్రయించుకొని ట్రాక్టర్లతో సేద్యం చేయించుకోవటం అలవర్చుకున్నారు. చెక్కబండ్ల స్థానంలో ఇనుపబండ్లు, కలపతో చేసిన నాగలి, గొర్రు, విత్తనం గొర్రు, పళ్లగొర్రు, స్థానంలో అన్ని ఇనుముతో తయారుచేసిన పరికరాలు జాతరలో విక్రయానికి వచ్చాయి. వ్యవసాయం మానుకోలేని రైతులు ఇనుప వ్యవసాయ పరికరాలతో పాటు ఎద్దులకు అవసరమైన జొతికెలు, తాళ్లు, మోకులు, ముక్కు తాళ్లు, బసవన్నలకు చెండుతాళ్లు వంటివి వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా తప్పనిసరైన పరిస్థితుల్లో కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. ప్రస్తుతం తర్తూరు జాతరలో ఎలాంటి కలప విక్రయాలు జరగడంలేదు.



చెక్కబండ్లు పోయి ఇనుపబండ్లు వచ్చే...

చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు

పాములపాడు: స్థానిక పొలిమేర చూడేశ్వరీదేవి అమ్మ వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నూతన దేవాలయ నిర్మాణం, నూతన విగ్రహం ప్రతిష్ట చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రజలు విశేషంగా తరలి వచ్చి నూతన వస్త్రాలు, కాయ, కర్పూరాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహానందిలో తగ్గిన రద్దీ

మహానంది: వరుసగా సెలవులు ఉండటంతో గత మూడు రోజులుగా భక్తులతో కిటకిటలాడిన మహానంది ఆలయ ప్రాంగణాలు మంగళవారం భక్తులు రద్దీ పూర్తిగా తగ్గిపోయింది. సెలవులు కావడంతో పాటు వివాహాలు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు వచ్చారు. సెలవులు ముగియడంతో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గిపోయింది. ఉదయం, సాయంత్రం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు అష్టవిధ మహామంగళ హారతులు నిర్వహించారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి మంగళవారం నందవరం గ్రామవాస్తవ్యులు నడిపెన్నగారి పెద్దబాల సుబ్బరాయుడు, పుల్లమ్మ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు, వేదపండితులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



పుల్లారెడ్డి పొలంలో నవధాన్యాలు చల్లుతున్న దృశ్యం

కొత్తపల్లి: పొలాల్లో నవధాన్యాలను సాగు చేసుకోవడం వల్ల నేల సారవంతం అవుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, ఎస్ఎఫ్ఏ మోడల్ మేకర్ సయ్యద్ బాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.లింగాపురం గ్రామానికి చెందిన పుల్లారెడ్డి రైతు పొలంలో నవధాన్యాల సాగు చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులు పంటలు సాగు పూర్తియిన తర్వాత మరలా నవదాన్యాలను సాగుచేసుకోవాలని సూచించారు. వీటి సాగుద్వారా నేలలో నీటిని నిల్వచేసుకొనే సామర్థ్యం పెరుగుతుందన్నారు. దీంతో తక్కువ వర్షపాతంలో కూడా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ ఇమ్రాన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్ఎఫ్ఏ నాగరాజు, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృషి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధానమంత్రి జన్మన్, డా జుగా పథకాల కింద గుర్తించిన 11 అంశాలలో పురోగతిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ వెంకట శివ ప్రసాద్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లో 48 గిరిజన నివాసిత ప్రాంతాలున్నాయన్నారు. వాటిలో గుర్తించిన సదుపాయాలను త్వరగా కల్పించాలన్నారు. గూడెంలలో గృహ నిర్మాణాలకు సంబంధించి 527 ఇళ్లు మంజూరు కాగా 92 మాత్రమే పూర్తి అయ్యాయని మిగిలిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటి స్థలాలు కేటాయించిన వారికి తప్పనిసరిగా పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని, సదరు సర్టిఫికెట్ ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. కొత్తపల్లిలో 38, పాములపాడులో 25, తదితర చెంచుగూడెంలలో 45 ఇళ్లు నూతంగా మంజూరు అయ్యాయని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కపిలేశ్వరం నుంచి జానాలలగూడెం వరకు వేస్తున్న 7.11 కి.మీ బిటి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సున్నిపెంట గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వానికి రూ.2,813 కోట్లతో డీపీఆర్ పంపడం జరిగిందన్నారు. సమగ్రశిక్ష ద్వారా వెలుగోడులో వంద పడకలు, కొట్టాలచెరువులో 50 పడకల కస్తూరిబా పాఠశాలల వసతి గృహాలకు భూమి పూజ చేశామన్నారు. వచ్చే ఏడాది లోపు అవి పూర్తి కావాలన్నారు. శ్రీశైలం ట్రైబల్ మ్యూజియం సమీపంలో మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్ ఏర్పాటుకు కోటి రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం,ప్రజా సంఘాల నాయకులు


పగిడ్యాల: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేసేంత వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వక్ఫ్ చట్ట సవరణపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందని, ప్రధాని మోదీ గద్దె దించేందుకు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం చట్ట సవరణలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆవాజ్‌కమిటీ నాయకులు మహ్మద్, సీపీఐ నాయకులు రఘురామ్మూర్తి, శ్రీనివాసులు, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో నవజాత శిశువు మృతదేహం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని శ్రమదానం బ్రిడ్జి సమీపంలోని మురుగు కాల్వలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. నీటిలో కొట్టుకోపోతుండగా స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. వారు శిశువు మృతదేహాన్ని తీసుకెళ్లి ఖననం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అల్లుడిపై హత్యాయత్నం...

- క్రికెట్ బ్యాట్, రాడ్డుతో తలపై మోదిన మామ, బావమరిది
- తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన అల్లుడు



గాయపడిన అశ్వినీకుమార్

పగిడ్యాల: కాపురానికి బిడ్డను తీసుకెళ్లటం లేదనే ఆగ్రహంతో అల్లునిపై మామ, బావమరిది, మరి కొంత మందితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అశ్వినీకుమార్ అదే గ్రామానికి చెందిన పాలూరి మోహన్‌కుమార్ అలియాస్ నారాయణ కుమార్తె పుష్పావతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. భార్యా, భర్తల మధ్య కుటుంబపరమైన విభేదాల కారణంగా ఇటీవల పుష్పావతి గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. సుమారు ఏడాది కాలంగా భార్యా, భర్తలు వేర్వేరుగా జీవిస్తున్నారు. సోమవారం పుష్పావతి బంధువైన ఉక్కు స్వామన్న ఆమె భర్త అశ్వినీకుమార్‌ల మధ్య రాజీకుదర్చి కాపురం చక్కదిద్దేందుకు యత్నించాడు. రాజీ కుదరకపోవటంతో ఉక్కు స్వామన్న వెళ్లిపోయా డు. పంచాయతీ విఫ లం కావడం.. తమ బిడ్డను కాపురానికి తీసుకెళ్లేందుకు అంగీకరించలేదనే కోపంతో పుష్పావతి తండ్రి మోహన్‌కుమార్, ఆమె అన్న మురళి క్రికెట్ బ్యాట్, ఇనుప రాడ్డుతో అశ్వినికుమార్‌పై దాడిచేశారు. గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. తలకు తీవ్రగాయాలైన అశ్వినీకుమార్‌ను కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సచేయించారు. బాధితుడు ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీడని మిస్టరీ!

మహానంది: మహానంది సమీపంలోని అరటిపొలాల్లో అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరావడం లేదు. మృతి చెందిన వ్యక్తికి ఘటనా స్థలంలోనే పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మహానందిలోని ఈశ్వర్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేసిన విషయం తెలిసిందే. అయితే మృతి చెందిన వ్యక్తి ఎవరు అనేది తెలిస్తే కానీ ఎక్కడి నుంచి వచ్చాడు, తనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ఎవరైనా చంపి ఇక్కడికి తీసుకొచ్చి తగలబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించారా అనే విషయాలు తెలిసే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

నందికొట్కూరు: ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు ప్రభుత్వం వాయిదా పడినట్లు ప్రిన్సిపల్ సలీంబాషా తెలిపారు. మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకొనుటకు ఈ నెల 20న జరగాల్సిన ప్రవేశ పరీక్షను ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రభుత్వం వాయిదా వేయడం జరిగిందన్నారు. 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 16న ఏపీ మోడల్స్ స్కూల్‌లో ఓరియటేషన్ క్లాస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం ఎదుట కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 15 ఏళ్లకు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ రూ, 29, 200, నాన్ టెక్నికల్‌కు జీతం రూ, 24, 500 పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు చాంద్ బాషా, రామయ్య, మారెన్న, సర్వర్‌ఖాన్, రాము, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

మేడే ను జయప్రదం చేయండి

ఆత్మకూరు: పట్టణంలో మే 1వ తేదీన జరిగే మే డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, సీపీఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్ కోరారు. మంగళవా రం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బీసన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించి మేడే కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో భవిష్యత్‌లో కార్మిక హక్కుల కోసం పోరా టాలు కొనసాగించాలన్నారు. సీపీఐ నాయకులు కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకటశివుడు, ఏఐటీయూసీ తాలూకా నాయకులు చాంద్‌బాషా, లాల్లు, పట్టణ కార్యదర్శి అహ్మద్‌హుసేన్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

పాణ్యం: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొణిదేడు భూపనపాడు రస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఫజులుల్లా వివరాల మేరకు.. కొణిదేడు గ్రామానికి చెందిన కాటసాని రామలక్ష్మమ్మ (65)పొలం వద్ద ట్రాక్టర్ దిగి రోడ్డు దాటుతుండగా భూపనపాడు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. రామలక్ష్మమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు రవిరెడ్డి ప్రస్తుతం కొణిదేడు ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. రెండో కుమారుడు రాజారెడ్డి రైతు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్షేత్ర స్థాయి సిబ్బందంటే చులకనా..?



ఏఓ గాయత్రికి ఫిర్యాదు చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు

పాములపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది అంటే చులకన భావమా అని టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ గాయత్రికి టీఏలు శ్రీధర్, కిరణ్, ఫయాజ్, 14 గ్రామ పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్లు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఈసీ మహ్మద్‌గౌస్ ఇక్కడకు బదిలీపై వచ్చి 10 రోజులవుతందన్నారు. అయితే కింది స్థాయి సిబ్బందిని చాలా చులకన భావంతో చూడటం, ప్రతి చిన్న విషయానికి దురుసుగా ప్రవర్తించడం, ఇష్టానుసారంగా బూతులు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కూలీల ముందు కూడా అలాగే ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ మల్లేశ్వరి

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి 3 నెలలకొకసారి నిర్వహించే సాధారణ సమావేశానికి అధికారులు నిరుత్సాహంగా కనిపిస్తూ గతంలో చేసిన పనులనే మళ్లీ మళ్లీ రిపీట్ చేసినట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. ఎంపీడీఓ పర్యవేక్షణ లోపమా, అధికారుల సమన్వయ లోపమా అని ప్రశ్నిస్తూ అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మండల సమస్యలపై ఆరా తీశారు. అమ్మకు వందనం పథకం కింద నిధులు ఎప్పుడు జమ చేస్తారని సభ్యులు ఎమ్మెల్యేను ప్రశ్నించగా జూన్‌నెలలో తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. పడమర ప్రాతకోట గ్రామానికి 1500 మీటర్ల మేర సీసీ రోడ్డు మంజూరు చేయించాలని మండల కో ఆప్షన్‌సభ్యుడు అస్లాం బాషా కోరారు. పగిడ్యాల ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి కూడా సీసీ రోడ్డు మంజూరు చేయించాలని ఎంపీటీసీ గోపాల్ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జేఈ జావీద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, సీడీపీఓ కోటేశ్వరమ్మ, రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎంఈఓ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం కొని తెచ్చుకోవద్దు!



సంతజూటూరు-లింగాపురం గ్రామాల రహదారిపై ఒకే బైకుపై నలుగురు యువకులు వెళ్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. యువతలో మార్పు రావడం లేదు. సెలవులు కావడంతో కొందరు సరదాగా.. మరికొందరు పనుల నిమిత్తం ఒకే బైక్‌పై ముగుర్లు, నలుగురు ప్రయాణిస్తున్నారు. ఇక నలుగురు యువకులు కలిస్తే అక్కడి వాతావరణం ఎలా ఉంటుందో తెలిసిందే. రయ్ మంటూ దూసుకెళ్లడం, ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడం లాంటి ఫీట్లు చేస్తుండటంతో ఎక్కడ ప్రమాదం బారిన పడతారేమోనని రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని సంతజూటూరు-లింగాపురం రహదారిపై పదిహేనేళ్ల వయస్సు లేని ఈ కుర్రోళ్లు ఒకే బైకుపై అజాగ్రత్తగా వెళ్తూ కనిపించారు.

సారూ.. కనిపిస్తోందా!



ఎంపీడీఓ కార్యాలయం దగ్గరున్న మురుగు కాలువ ఇలా..

మహానంది: రోడ్ల వెంట చెత్త కనిపిస్తే కఠినచర్యలు తప్పవని ఓ వైపు ఉన్నతాధికారుల హెచ్చరికలు..మరో వైపు పొరకలు చేత పట్టుకుని స్వచ్ఛతా హీ సేవ అంటూ అధికారుల ఫోజులు. ఇలా స్వచ్ఛత ప్రకటనలకు మాత్రమే పరిమితంగా కాగా ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి లోపించింది. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న మురుగు కాలువ చెత్తతో నిండిపోయింది. కాలువకు ఎదురుగా వైన్ షాపు ఉండటంతో అక్కడి ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నీళ్ల ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు అన్నీ కాలువలోనే వేస్తుండటంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్గంధం వెదరజల్లుతోంది. అధికారులు స్పందించి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంప్రమానుదిన్నె వృషభాల జయకేతనం



విజేతలైన ఎద్దుల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన పెద్దబండ (సీనియర్స్ విభాగం) ఎద్దుల బండలాగుడు పోటీల్లో శిరివెళ్ల మండలం, గుంప్రమానుదిన్నె వృషభాలు విజయదుందుభి మోగించాయి. పోటీల్లో కేవలం ఐదు జతల వృషభాలు పాల్గొనగా అందులో గుంప్రమానుదిన్నె కు చెందిన కందుకూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు అత్యధిక దూరం బండనులాగి మొదటి బహుమతి రూ.70వేలు కైవసం చేసుకున్నాయి. అదే గ్రామం రాంభూపాల్‌రెడ్డికి చెందిన మరో జత ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.50వేలు దక్కించుకున్నాయి. టీ.హుసేనాపురం కు చెందిన మోతుకసాటి రామసుబ్బారెడ్డికి చెందిన ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ.30వేలు, గుంప్రమానుదిన్నెకు చెందిన సయ్యద్‌కలాం ఎద్దులు నాల్గొవ స్థానంలో నిలిచి రూ.20వేలు, సీసంగుంతలకు చెందిన ఆల మదన్‌మోహన్‌రెడ్డి కి చెందిన వృషభాలు ఐదోవస్థానంలో నిలిచి రూ.10వేలు చేజిక్కించుకున్నాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, దొరబాబు, రమణారెడ్డి, కోట్ల నారాయణరెడ్డి నగదు బహుమతితో పాటు శాలువాకప్పి స్వామివారి మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుయాదవ్, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, నారపురెడ్డి, జయన్న, గిరీశ్వర రెడ్డి, మద్దికుంట నాగార్జునరెడ్డి, మండడి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.